సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 5 । మార్చి । 2024



గురువులకు మరింత సులువు!

అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టింది. గురువులకు మరింత సులువయ్యేలా స్విఫ్ట్‌చాట్ యాప్‌ను తీసుకొచ్చింది.


8లో

బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠకు సన్నాహాలు

రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్య నారాయణ స్వామి వారి దేవస్థానంలో నూతన 'బంగారు' ధ్వజస్తంభం ప్రతిష్ఠకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.



డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

స్పందనకు 163 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి ప్రజలు 163 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 12 చొప్పున అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిని నిర్దీత గడువు లోగా నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. అర్హత కలిగిన వారందరూ సంక్షేమ పథకాల లబ్ధి పొందేలా వారికి మార్గదర్శకం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 27 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో జిల్లా ఎస్పీ పి.జగదీష్ నేరుగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత సీఐ, ఎస్సై, డీఎస్పీలతో కలసి, బాధితుల సమక్షంలోనే వారి ఫిర్యాదులను పరిశీలించారు. వాటి పరిష్కారానికి వెంటనే ఆయా స్టేషన్ల పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీసు స్పందనకు సివిల్ 6, కుటుంబ కలహాలు 7, చీటింగ్ 8, ఇతర కేసులపై 6 చొప్పున ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

నిడదవోలు నుంచి పోటీ చేస్తా : దుర్గేష్

కడియం: నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రకటించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముద్రగడ జెమీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాల మేరకు నిడదవోలు నుంచి పోటీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు.

2019 తర్వాత నియమించిన ఉద్యోగుల వివరాలివ్వాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వివిధ ప్రభుత్వ శాఖల్లో 2019 తరువాత నియమితులైన ఉద్యోగులు తమ సమగ్ర సమాచారాన్ని జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్‌కు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి సోమవారం వచ్చిన అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 2019 తరువాత ఏపీపీఎస్సీ ద్వారా, వైద్య, ఆరోగ్య శాఖలో, కారుణ్య, బ్యాక్‌లాగ్ పోస్టుల్లో నియమితులైన వారితో పాటు క్రమబద్ధీకరణ చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ వివరాలు తక్షణం అందజేయాలని పేర్కొన్నారు. ఈ వివరాలను ఈ-మెయిల్ లేదా నేరుగా కానీ జిల్లా ఉపాధి కల్పనా అధికారికి అందజేయాలన్నారు.

'ప్రసాద్' నిర్మాణాలకు సన్నాహాలు

అన్నవరం: పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ (ప్రసాద్) స్కీము కింద కేంద్ర ప్రభుత్వం అన్నవరం దేవస్థానానికి మంజూరు చేసిన రూ.20 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ నిధులతో పాత టీటీడీ భవనం స్థలంలో ఒకేసారి 1,600 మంది భోజనం చేసేలా రెండంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మించాలని నిర్ణయించారు. అలాగే, ప్రస్తుత అన్నదాన భవనం కూల్చివేసి, దాని స్థానంలో వెయ్యి మంది వేచి ఉండేలా క్యూ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. వీటితో పాటు ప్రకాష్ సదన్ వెనుక ఉన్న పార్కింగ్ స్థలంలో సత్యగిరి, రత్నగిరికి అందుబాటులో ఉండేలా టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నిర్మాణాలన్నీ రెండేళ్ల వ్యవధిలో పూర్తయ్యే అవకాశం ఉంటుంది. అలాగే, సత్రాల నుంచి భక్తులు ఆలయానికి రాకపోకలు సాగించేందుకు రెండు బ్యాటరీ కార్లు మంజూరు చేయనున్నారు. ఈ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 7న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో రత్నగిరిపై ఈ నిర్మాణాలు చేపట్టే స్థలాలను కేంద్ర పర్యాటక శాఖ అసిస్టెంట్ మేనేజర్ చేతన్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈ సీఎస్ఎన్ మూర్తి, దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ సోమవారం పరిశీలించారు. ఈ స్థలాలను పరిశీలించిన పర్యాటక అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాని శంకుస్థాపన ఏర్పాట్లపై ఈఓతో చేతన్, మూర్తి చర్చించారు.



సభకు తరలివచ్చిన ప్రజలు

మళ్లీ జగనే సీఎం

- ఎవరెన్ని కుట్రలు పన్నినా విజయం తథ్యం
- వైఎస్సార్ సీపీ హయాంలోనే రాజమహేంద్రవరం అభివృద్ధి
- 'సిద్ధం' సభలో టీడీపీపై మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని ధ్వజం
- గూడూరి శ్రీనివాస్, భరత్‌రామ్‌ను ఆశీర్వదించాలని పిలుపు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, డ్రామోజీ, ఎల్లో మీడియాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీయేనని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరించడం తథ్యమని మాజీ మంత్రులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని, పేర్ని వెంకట్రామయ్య (నాని) చెప్పారు. రాష్ట్రాన్ని చేజిక్కించుకునేందుకు చంద్రబాబు.. చివరకు తనతో నడిచే జనసేన పార్టీకి కూడా వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధపడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో ఎంపీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి 'రాజమహేంద్రవరం సిద్ధం' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి, ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ



'సిద్ధం' సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని. చిత్రంలో వైఎస్సార్ సీపీ సిటీ, పార్లమెంటరీ కో ఆర్డినేటర్లు మార్గాని భరత్‌రామ్ (ఎంపీ), డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రులు కొడాలి, పేర్ని తమదైన శైలిలో చేసిన ప్రసంగాలతో పార్టీ కార్యకర్తలు, నగర వాసుల్లో జోష్ నింపారు. టీడీపీ, జనసేన పైకి పొత్తు మిత్రులే కానీ.. వాస్తవంగా రెండు పార్టీలూ ఒకరికొకరు శత్రువులేనని అన్నారు. సహజంగా ప్రతిపక్ష అభ్యర్థులను ఓడించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తారని, అందులో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు నెగ్గేందుకు సీఎం వైఎస్ జగన్ వ్యూహాలు రచించడం తప్పా అని ప్రశ్నించారు. అధికారం కోసం వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఆయన ఎప్పుడూ ఒంటరిగా పోటీ చేసిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి సీఎంగా జగన్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. అలాగే, రాజమహేంద్రవరం నగరంలో ఎంపీ భరత్‌రామ్ చేసిన అభివృద్ధిని చూసి ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేత ఆదిరెడ్డిపై ఫైర్

రాజమహేంద్రవరం నగరంలో ఒక మహిళా వలంటీర్‌ను ఫోన్ చేసి బెదిరించిన టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుపై ఎంపీ భరత్‌రామ్, మాజీ మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. వలంటీర్‌గా సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకు చేరుస్తున్న ఆడపిల్లకు ఫోన్ చేసి వార్నింగ్ ఇవ్వడం మగతనం కాదని, ఇది తగదని అన్నారు. రాజమహేంద్రవరంలోని వలంటీర్లు తన తోబుట్టువులతో సమానమని, వారిని కానీ, పార్టీ కార్యకర్తలను కానీ పల్లెత్తు మాట అన్నా సహించేది లేదని ఎంపీ భరత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజం, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనంత అభివృద్ధి, సంక్షేమం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే చేపట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద గడచిన ఐదేళ్లలో లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా రూ.2.55 లక్షల కోట్లు జమ చేశారన్నారు. చంద్రబాబు ఎప్పుడైనా ఇలా వేశాడా? అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో లేనిపోని హామీలు గుప్పించి, ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాడని, ఆ తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేశాడని ధ్వజమెత్తారు. విద్య, వైద్య రంగాల ప్రగతికి జగన్ చేస్తున్న కృషిని మాజీ మంత్రులు వివరించారు.

బాబుకు బుద్ధి చెప్పాలి

అబద్ధాలు, దగాకోరు చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎంపీ, పార్టీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. పక్క రాష్ట్రంలో తలదాచుకుంటూ, ఏపీలో రాజకీయ వ్యాపారం చేస్తున్న చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు రాష్ట్రానికి అవసరం లేదన్నారు. పేదల ప్రభుత్వం, సంక్షేమ ప్రభుత్వం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలను వంచించేందుకు టీడీపీ, జనసేన నేతలు కల్లబొల్లి మాటలు చెబుతారని, ఆచరణ యోగ్యం కాని వాగ్దానాలు చేస్తారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు సీఎం జగన్ చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు.

మేం పనికిరామా?

- మా భవిష్యత్తుకు ఏదీ గ్యారెంటీ?
- చంద్రబాబు తీరుపై ఆశావహుల మండిపాటు
- కొవ్వూరు టికెట్ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

కొవ్వూరు: గ్రూపు రాజకీయాలతో సతమతమవుతున్న కొవ్వూరు టీడీపీలో అభ్యర్థి ఖరారు అంశం ఆ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. కొవ్వూరు అభ్యర్థిగా ఒక్క ముప్పిడి వెంకటేశ్వరరావు పేరుపై మాత్రమే అధిష్టానం సోమవారం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేసింది. దీనిపై స్థానికులైన ఆశావహులు తీవ్ర అసంతృప్తి, చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి తమను వాడుకుని, తమకు అవకాశం వచ్చినప్పుడు కరివేపాకుల్లా తీసి పారేస్తున్నారంటూ మండిపడుతున్నారు. కొవ్వూరులో ఆ పార్టీ ఆశావహులు ప్రత్యేకంగా సమావేశమై మీడియా ఎదుట తమ అసంతృప్తి వెళ్లగక్కారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడి, చేతిచమురు వదిలించుకుని, ఆర్థికంగా నష్టపోయామని అన్నారు. గత ఎన్నికల్లో స్థానికేతరులైన పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు టికెట్ ఇవ్వడంతో ఓటమి పాలయ్యామని, మళ్లీ ఇప్పుడు స్థానికేతరుడైన మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేరు పరిశీలించడంతో తాము నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కనీసం నియోజకవర్గ ఓటరు కాని వ్యక్తులకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో 45 వేల మంది ఎస్సీలున్నారని, తమలో ఏ ఒక్కరూ పని చేయరా అని ప్రశ్నించారు. స్థానికంగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న ఆశావహుల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా సమష్టిగా పని చేస్తామని చెప్పారు. బాదుడే-బాదుడు, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ, ఇదే ఖర్మ రాష్ట్రానికి, సూపర్ సిక్స్, రా.. కదలిరాతో పాటు చంద్రబాబు అరెస్ట్ సమయంలో పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాల్లోనూ భాగస్వాములమైన తమ పేర్లు ఇప్పుడు కనీసం పరిశీలనలో కూడా లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అభ్యర్థి విషయమై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మునిసిపల్ మాజీ చైర్మన్ కొల్లి రమేష్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పెనుమాక జయరాజు, రాపాక సుబ్బారావు, జీజీ చలం, వేమగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నల్లజర్ల హైస్కూలు ఉపాధ్యాయులు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఓపెన్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొన్న నల్లజర్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ముగ్గురు బంగారు పతకాలు, ఒకరు రజ త పతకం సాధించారు. హెచ్ఎం కోమలిచిత్ర సోమ వారం ఈ విషయం తెలిపారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ఈ పోటీలు జరిగాయన్నారు. అండర్-14 షాట్‌పుట్‌లో ఎం.దుర్గాభవాని, 800 మీటర్ల పరుగులో ఉదయ పోసేశ్వరికి బంగారు పతకాలు సాధించారన్నారు. అలాగే అండర్- 17 విభాగం 1,500 మీటర్ల పరుగులో సీహెచ్ సుభద్రకు రజత, అండర్-12 విభాగంలో పి.హర్షవర్ధన్(నంబర్-1 పాఠశాల) బంగారు పతకం సాధించారని తెలిపారు. విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయురాలు త్రిపుర స్వాతిని అభినందించారు.

రాజమహేంద్రవరంలో పోలీసుల కవాతు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర పోలీసు దళాలు జిల్లాలో పని చేస్తాయని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. సుమారు 400 మంది సీఐఎస్ఎఫ్ దళాలు, స్థానిక పోలీసులు నగరంలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. దీనిని కలెక్టర్ కె.మాధవీలత జెండా ఊపి ప్రారంభించారు. కంబాలచెరువు దండి విగ్రహాల వద్ద నుంచి పుష్కర ఘాట్ వరకూ నిర్వహించిన ఈ కవాతులో ఎస్పీ, కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కేంద్ర దళాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని అన్నారు. వీరందరికీ రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లా పోలీసులు వారికి వసతి సౌకర్యాలు అందించాలని, లైజనింగ్ అధికారులను నియమించి, ఎటువంటి అవసరం ఏర్పడినా వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు



కవాతులో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలో ఫ్లాగ్‌మార్చ్‌లు, రూట్ మార్చ్‌లు, చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీల వంటి విధులు ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పరిస్థితులు, భౌతిక స్వరూపం, స్థితిగతులను కేంద్ర దళాలకు మ్యాప్ ద్వారా ఎస్పీ వివరించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్ కుమార్, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ ఎస్‌బీ డి.ప్రభాకర్, సూరి అప్పారావు, జోనల్ డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య యాత్రకు ప్రత్యేక బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: కాశీ, అయోధ్య యాత్రకు 106 మంది భక్తులతో బయలుదేరిన 3 ప్రత్యేక బస్సులను జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) షర్మిల అశోక సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సుల్లో భక్తులు 11 రోజుల పాటు 13 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి మార్చి 15న ఇక్కడకు చేరుకుంటాయని తెలిపారు. తీర్థయాత్రలకు వెళ్లేందుకు భక్తులకు అవసరమైన ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరిక్షా కాలం



- గోదావరి డెల్టాలో కీలక దశలో రబీ
- కాలువలకు ఇప్పటి వరకు 67 టీఎంసీల విడుదల
- మరో 40 రోజులు నీటి సరఫరా అవసరం
- ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు
- మెరక, శివారులపై ప్రత్యేక దృష్టి

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ కీలక దశకు చేరింది. వరి చేలు పాలుపోసుకుని పొట్టదశకు చేరుకుంటున్నాయి. ఈ సమయంలో వరి చేలల్లో నీటిని అధికంగా పెడుతుంటారు. మరోవైపు వేసవి సమీపిస్తుండడం.. ఎండలు మండుతుండడంతో చేలల్లో నీరు ఆవిరి రూపంలో పైకి పోతుండడం వల్ల కూడా ఈ సమయంలో నీటి వాడకం అధికంగా ఉంటోంది. మరో 40 రోజుల పాటు డెల్టాకు నీరు విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ కాలం రబీసాగు నీటిపారుదల శాఖ అధికారులకు, రైతులకు పరీక్షగా మారనుంది.

ఇదీ లెక్క..

గోదావరి డెల్టాలో మొత్తం ఆయకట్టు 8.80 లక్షల ఎకరాలు. వాస్తవంగా వరి సాగు రబీలో సుమారు 7.50 లక్షల ఎకరాలు జరుగుతోందని అంచనా. డాక్టర్ బి. ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 1.92 లక్షల ఎకరాల్లో రబీ సాగుకు సంబంధించి సుమారు 1.73,397 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. కాకినాడ జిల్లాలోని పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) పరిధిలో సుమారు 30 వేల ఎకరాలలో వరి సాగు జరుగుతుండగా, తూర్పు డెల్టా పరిధిలో తాళ్లరేవు, కాజులూరు, కరప వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 66 వేల ఎకరాలలో సాగు జరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో తూర్పు, పశ్చిమ డెల్టాల పరిధిలో కొవ్వూరు, అనపర్తి, రాజమహేంద్రవరం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో 65 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోందని అంచనా.

ఇప్పుడే నీటి వాడకం ఎక్కువ

నిర్దీత షెడ్యూలు కన్నా తూర్పు, మధ్య డెల్టాలలోని శివారు ప్రాంతాల్లో నాట్లు ఆలస్యం అయ్యాయి. ఈ కారణంగా మార్చి 31 వరకు అనుకున్న డెల్టా కాలువలకు సాగునీటి పంపిణీ.. ఏప్రిల్ 15 దాటే వరకు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం డెల్టా చేలు పాలు పోసుకుని పొట్ట దశకు చేరుకున్నాయి. ముందుగా సాగు చేసిన తూర్పు డెల్టాలోని ఆలమూరు, మధ్య డెల్టాలోని కొత్తపేట సబ్ డివిజన్లలో ఈనిక దశలో ఉన్నాయి. ఈ సమయంలో చేలల్లో రైతులు నీటిని అధికంగా వినియోగిస్తుంటారు. అయితే శివారుల్లో అక్కడక్కడా రైతులు కోరుకున్న సమయంలో నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులు డెల్టా కాలువలకు సంవృద్ధిగా సాగునీరు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున మొత్తం మూడు డెల్టాలకు కలిపి 8,970 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు 8,275 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీనిలో సీలేరు నుంచి వస్తున్నది 90 క్యూసెక్కులు మాత్రమే కాగా, మిగిలిన 8,185 క్యూసెక్కులు పోలవరం ప్రాజెక్టు ద్వారా దిగువకు విడుదలవుతోంది. గత ఏడాది ఇదే సమయంలో 7,500 క్యూసెక్కుల చొప్పున డెల్టా కాలువలకు విడుదల చేసేవారు. కాని ఇప్పుడు 8,970 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

67 టీఎంసీల వినియోగం

గోదావరిలో ఈ ఏడాది ఇన్‌ఫ్లోలు తక్కువగా ఉన్నందున నీటి లభ్యత ఆశాజనకంగా ఉండదని భావించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు 67.230 టీఎంసీల వరకు నీటిని గోదావరి కాలువలకు వదులుతున్నారు. డిసెంబర్ 7వ తేదీ రబీ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు తూర్పు డెల్టాకు 20.347, మధ్యడెల్టాకు 12.592, పశ్చిమ డెల్టాకు 34.291 టీఎంసీల చొప్పున మొత్తం 67.230 టీఎంసీల వరకూ నీరు విడుదల చేశారు.



మధ్యడెల్టాలోని ఆత్రేయపురంలో పాలు పోసుకుంటున్న వరిచేలు



లొల్ల లాకులు

మెరక, శివారులపై దృష్టి పెట్టండి



మధ్య డెల్టాలో శివారు, మెరక ప్రాంతాలకు నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విప్పర్తి వేణుగోపాలరావు ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు శ్రీనివాస్‌ను కోరారు. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పి.గన్నవరం మండలం పోతవరం, మామిడికుదురు మండలం నగరం, పాశర్లపూడి వంటి ప్రాంతాల్లో రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఈని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న డ్యూటీని తగ్గించి నీరు అందేలా చూడాలని, కనీసం మరో 40 రోజుల పాటు నీరు అందించాల్సి ఉన్నందున ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చాగల్లు: మండలంలోని కలవలపల్లి గ్రామంలో సోమవారం పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. రాజమండ్రి విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు కలవలపల్లి గ్రామంలో రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో భాగంగా మెట్టపల్లి నరసింహరాజు వద్ద రూ. 92,375 విలువైన 2050 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. నరసింహరాజు రేషన్‌కార్డుదారుల నుంచి రూ. 16కు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇటుక బట్టీ, ఇతర కార్మికులకు విక్రయిస్తున్నాడన్నారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని కలిగి ఉన్న నేరంపై నరసింహరాజుపై 6ఏ కేసు నమోదుచేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై క్రిమినల్ కేసుకు సిఫారసు చేశామన్నారు. విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, చాగల్లు సీఎస్‌డీటీ బాపిరాజు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దూర విద్య కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల ప్రవేశాలకు గడువు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఆ స్టడీసెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఎంఆర్ గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇగ్నో అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లమా, పీజీ డిప్లమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు ఇగ్నోఅడ్మిషన్స్.సమర్థ్.ఎడ్యు.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రాయితీ ఉందన్నారు.

పార్కింగ్ వేలం పాట రూ.91,15,111

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ భక్తుల పార్కింగ్‌లో వాహనాలు నిలుపుదలకు వేలం పాట నిర్వహించగా సంవత్సరానికి రూ.91,15,111 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. ఈఓ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది రూ 55,65,569 ఆదాయం వచ్చిందన్నారు.

గురువులకు మరింత సులువు!

- మెరుగైన బోధనకు 'స్విఫ్ట్‌చాట్'
- ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్స్‌తో యాప్ అనుసంధానం
- ప్రతి టీచర్ మొబైల్‌లో యాప్ ఉండేలా ఆదేశాలు

స్విఫ్ట్ చాట్ యాప్ లోగో

రాయవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి, అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టి విద్యలో విప్లవాత్మక చర్యలకు తెరతీసింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందజేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయడమే కాకుండా..వాటిని వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చింది. డిజిటల్ విద్యను మరింత అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా 'స్విఫ్ట్ చాట్' యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఉపాధ్యాయులు బోధనను మరింత మెరుగు పర్చేందుకు ఈ యాప్ ప్రతి ఉపాధ్యాయుడి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.



బైజూస్ ట్యాబ్స్‌తో విద్యార్థులు



ఐఎఫ్‌పీ సహాయంతో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

జిల్లాలో పరిస్థితి ఇదీ..

అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఫ్లాట్‌ఫామ్‌పై పనిచేసే విధంగా రూపొందించిన యాప్‌ను ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీనికి సంబంధించిన లింక్‌ను కూడా విద్యాశాఖ ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉపాధ్యాయులకు చేరవేసింది. లింక్‌తో పాటు ఇన్‌స్టాలేషన్ ఏ విధంగా చేసుకోవాలో తెలియజేసే సమాచారాన్ని పంపించారు. ఇప్పటికే 99శాతం మంది ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో 5,555 మంది ఉపాధ్యాయులు ఒకటి నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్నారు.

ఇన్‌స్టాల్ చేసుకోవాలిలా..

'స్విఫ్ట్ చాట్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో ప్లేస్టోర్‌లో ఏపీ టీచర్ బోట్‌ను ఎంపిక చేసుకోవాలి. యాప్ ఓపెన్ అయిన తర్వాత రిజిస్టర్ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి, విద్యాశాఖ నుంచి వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. అనంతరం సంబంధిత పాఠశాల స్కూల్ యూడైస్ కోడ్, సంబంధిత ఉపాధ్యాయుడి సీఎఫ్ఎంఎస్ ఐడీ నమోదు చేయాలి.

గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్

ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ఇప్పటికే గణితం, ఫిజికల్, బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో స్విఫ్ట్ యాప్, ఓ ల్యాబ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్, పలు వెబ్‌సైట్లపై అవగాహన కల్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 508 మంది గణితం, 335 మంది ఫిజికల్ సైన్స్, 349 మంది బయలాజికల్ సైన్స్ టీచర్లకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలు, బైజూస్ ట్యాబ్స్‌లో ముందుగానే 'స్విఫ్ట్ చాట్' యాప్ ఇన్‌స్టాల్ చేశారు.

'స్విఫ్ట్ చాట్' అంటే..

ఉపాధ్యాయుడు బోధన చేసే సమయంలో విద్యార్థులకు సబ్జెక్టు పరంగా సమగ్రమైన జ్ఞానాన్ని అందించాల్సి ఉంటుంది. బోధనలో భాగంగా తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగానే 'స్విఫ్ట్ చాట్'లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణాల్లో సంబంధిత సమాచారం యాప్‌లో ప్రత్యక్షమవుతుంది. ఈ యాప్‌లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతుల వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటిషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రివార్డులు పొందుపర్చారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశం యాప్‌లో ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతులకు గణితం, మూడు నుంచి ఆరవ తరగతి వరకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్తులో డిజిటల్ తరగతులు పొందుపర్చనున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి



స్విఫ్ట్ చాట్ యాప్‌ను ఉపాధ్యాయుల ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. సాంఘిక సంక్షేమం, గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, మినిమమ్ టైమ్ స్కేల్‌లో పనిచేసే ఉపాధ్యాయులకు త్వరలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశమిస్తారు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

మానవ సేవే మాధవ సేవ



వివిధ మతాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఉమర్ ఆలీషా

పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

తుని: భిన్నత్వం నుంచి ఏకత్వం వైపు నడిపించేది మానవత్వమని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఉద్బోధించారు. సోమవారం తుని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలోని కొహెన్ షా వల్లీ దర్గా ప్రాంగణంలో సోమవారం 27వ వార్షికోత్సవ మత సామరస్య మహాసభ ఆలీషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహణ భాషణ చేశారు. మానవుల మధ్య హింస, అసూయ, ద్వేషం నిర్మూలనకు త్రయ సాధన ఆచరించాలన్నారు. పంచ భూత కాలుష్య నివారణకు మొక్కలను పెంచడం మానవుల విధి అన్నారు. సమాజం శాంతియుతంగా ఉంటే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. సర్వ మతాలు చెప్పేది ప్రేమ, కరుణ కలిగి ఉండటం అన్నారు. ఆరాధన ఎలా చేసినా చివరకు గమ్యస్థానానికి చేరుకుంటారని బోధించారు. హిందూ, ఇస్లాం ,క్రైస్తవ, జైన, బౌద్ధ, సిక్కు మతాలకు చెందిన ప్రతినిధులు ఆయా మతాల ప్రాధాన్యతను వివరించారు. అన్ని మతాలకు చెందిన ప్రతినిధులతో ఉమర్ ఆలీషా చేతులు కలిపి దేశ సమగ్రత, విశ్వశాంతి కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఉమర్ ఆలీషా రూరల్ ట్రస్టు ద్వారా ఆశ్రమ వాసులకు వస్త్రాలు, మహిళలకు చీరలు, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పంపిణీ చేశారు. వివిధ మతాలకు చెందిన ప్రతినిధులను సద్గురువర్యులు ఉమర్ ఆలీషా సత్కరించారు. ఉమర్ ఆలీషా ట్రస్ట్ కమిటీ ప్రతినిధులు సీహెచ్ సత్యనారాయణ, ప్రసాద వర్మ, కేశవరాజు, జీవీవీ సత్యనారాయణ, సబ్బిరెడ్డి అప్పన్న రెడ్డి, గోసుల రమణ, జి.ఆదినారాయణ, కె.వెంకట అప్పారావు, పేరూరి సూరిబాబు, ఉమ్మడి తూర్పు, విశాఖ జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

లడక్‌లో సాహసయాత్ర

గిన్నిస్ బుక్ రికార్డ్



లడక్‌లో సాహసయాత్ర చేస్తున్న సత్యసాయి నాగచైతన్య



తాను సాధించిన గిన్నిస్ రికార్డ్స్ సర్టిఫికెట్లు చూపుతున్న సత్యసాయి నాగచైతన్య

బోట్‌క్లబ్: కాకినాడ నగరానికి చెందిన చెల్లురి సత్యసాయి నాగచైతన్య లడక్‌లో 21 కిలో మీటర్లు ప్రయాణం చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ సాధించారు. మైనస్ 20 డిగ్రీల అతి శీతల ప్రతికూల వాతావరణంలో యాత్ర చేసి ఈ రికార్డు సాధించాడు. ప్రస్తుతం నాగచైతన్య ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఉద్యోగం చేస్తున్నాడు. 8వ తరగతి చదివే రోజుల్లోనే భిన్నమైన ఆలోచన ఉన్న నాగచైతన్య రివర్స్ రైటింగ్‌తో అందరి మన్ననలు అందుకొన్నాడు . శ్వాస కూడా ఆడని ఈ వాతావరణంలో 21 కిలోమీటర్లు ప్రయాణించడం చాలా కష్టసాధ్యమైనదని నాగచైతన్య విలేకర్లకు తెలిపారు.

బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠకు సన్నాహాలు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నూతన 'బంగారు ' ధ్వజస్తంభం ప్రతిష్ఠకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు పాత ధ్వజస్తంభం కళాప్రకర్షణ, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించిన విషయం విదితమే. శెల్లూరుకి చెందిన దాత రూ.3.5 కోట్ల వ్యయంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు గత ఏడాది ఆగస్టులో ముందుకు వచ్చారు. 'నారవ ' వృక్ష జాతికి చెందిన 64 అడుగుల కర్రను సేకరించి ధ్వజస్తంభంగా తయారు చేసి దానిని దేవస్థానంలోని పంపా సత్రానికి తరలించారు. ఇప్పటికే ఈ ప్రతిష్ఠకు సంబంధించి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఇంజినీరింగ్ అధికారులకు పలు ఆదేశాలిచ్చారు.

ఏర్పాట్ల గురించి చర్చించేందుకు దేవదాయశాఖ డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచారి, ఎస్‌జీవీఎస్ శేఖర్ సోమవారం ఈఓ కె.రామచంద్రమోహన్ తో సమావేశమయ్యారు. అనంతరం దేవస్థానం ఈఈ మురళీ, డీఈ ఉదయ్ తదితరులతో కలిసి పంపా సత్రం వద్ద గల సిద్ధమైన ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. దానిని స్వామివారి ఆలయం లోపలకు చేర్చే విషయమై చర్చించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూర్తయ్యాక బంగారు రేకు తాపడం చేస్తారు. ఈ మొత్తం ప్రక్రియకు అయ్యే ఖర్చు అంతా దాత భరిస్తున్నట్లు తెలిపారు.



పంపా సత్రం వద్ద ఉంచిన నూతన ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు

వారు ప్రేమికులే

- ఇద్దరూ మైనర్లేనని గుర్తించిన పోలీసులు
- మృతులు రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామ వాసులు



చైతన్య, జ్యోతి (ఫైల్)

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని కటికి రహదారి కరకవలస గ్రామ సమీపంలోని ఆదివారం సాయంత్రం చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన యువతీ యువకులు ప్రేమికుల జంట అని, ఇద్దరూ మైనర్లని పోలీసులు గుర్తించారు. వారిద్దరూ తూర్పుగోదావరి జిల్లా హుకుంపేట గ్రామానికి చెందినవారు. మృతుల వద్ద దొరికిన వివరాలు, వారి స్వస్థలంలో నమోదైన మిస్సింగ్ కేసుల ఆధారంగా వారి ఆచూకీని సేకరించారు. మృతులను చైతన్య (17), జ్యోతి (14)లుగా గుర్తించారు. యువతి 9వ తరగతి చదువుతోంది. వీరిద్దరూ గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. వారం రోజులపాటు వివిధ ప్రాంతాల్లో తిరిగి, ఆదివారం అనంతగిరి మండలం కటికి జలపాతాన్ని సందర్శించి, సాయంత్రం ఓ చెట్టు వద్ద ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలకు సోమవారం అరకు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మల్లాయిపాలెం కొత్తకాలనీకి చెందిన సానబోయిన దేవిశ్రీ(32) సోమవారం ఉదయం తన నివాసముంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దేవిశ్రీ భర్త మోహన్ అత్తమామలతో కలిసి మల్లయ్యపాలెంలో నివాసం ఉంటున్నాడు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన శ్రీదేవి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు సమాచారం. ఆమెకు కుమారుడు, తనూజ నాగసూర్య, వర్దిని కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

రాజమహేంద్రవరం రూరల్: హత్యకేసులో శాటిలైట్‌సిటీ డి–బ్లాక్ , గౌతమినగర్ లో ఉంటున్న బోయిన ముసలయ్య ఎలియాస్ ముసలికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పదివేల రూపాయల జరిమానా, అది కట్టని పక్షంలో అదనంగా ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బోయిన ముసలయ్య, డి– బ్లాక్‌కు చెందిన నీలాల మంగారావు రాడ్ బెండ్ పనికి వెళ్లేవారు. వారితోపాటు ముసలయ్య అన్న దుర్గారావు కూడా వెళ్లేవాడు. దుర్గారావును మంగారావు మందు తాగించి పాడుచేస్తున్నాడు అని అనుమానించి ముసలయ్య తండ్రి మంగారావును మందలించాడు. దీంతో ముసలస్య తండ్రిపై మంగారావు దాడి చేశాడు. దీంతో ముసలయ్య మంగారావుపై కక్ష పెంచుకొన్నాడు. 2019 ఫిబ్రవరి 25వ తేదీరాత్రి 10గంటల సమయంలో ముసలయ్య తాను పని చేస్తున్న మేస్త్రీ లీల వద్దకు వెళ్లి రేపు పనిలోకి రాను, నా అన్న దుర్గారావును పాడుచేస్తున్న మంగారావు అంతు చూస్తాను అని చెప్పాడు. మరుసటి రోజు ఉదయం 8.30 గంటల సమయంలో ముసలయ్య మంగారావు ఇంటికి తన బండిపై వెళ్లాడు పనికి వెళదాం రా అని బండిపై ఎక్కించుకొని తీసుకొని వెళ్లాడు. సుమారు 12 గంటల సమయంలో మంగారావు పిన్ని అతనికి ఫోన్ చేసి ఎక్కడున్నావ్ అని అడుగగా పిట్టలవాని చెరువు దగ్గర గల కల్లు దుకాణంలో నేను, ముసలయ్య కల్లు తాగుతున్నామని చెప్పాడు. ఇద్దరం ఇంటికి వచ్చేస్తున్నాం అని కూడా చెప్పాడు. ముసలయ్య తక్కువగా తాగి, మంగారావుకి ఫుల్‌గా తాగించాడు. తన బండిపై బుచ్చయ్య నగర్ నుంచి కవలగొయ్యి వెళ్లే రోడ్డులో గల మునిని శ్రీను తోట వద్ద గల బోదిలోకి తోసేసి, అక్కడ గల పెద్ద బండ రాయిని ముఖంపై పడేశాడు. ముఖం నుజ్జు నుజ్జు అయిపోవడంతో మంగారావు మృతిచెందాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కె.దామోదర్‌రావు సాక్షులను విచారించి, కోర్టులో ప్రవేశ పెట్టారు. కేసు రాజమండ్రి తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టులో విచారణకు రాగా సీఐ విజయ్ కుమార్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.వి. రమణ సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరము రుజువు కావటంతో రాజమండ్రి 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఎం.ఎ బాషా వాదనలు వినిపించారని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ సీఐ ఉమర్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రూ.82 వేలు విలువ గల 16.5 కేజీల గంజాయి స్వాధీనం

గోకవరం: గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.82 వేల విలువైన 16.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం కొత్తపల్లిలోని చాకలిరేవు సమీపంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన అక్షయ రైటా, జిబిట్ రైటా అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎనిమిది ప్లాస్టిక్ సంచుల్లో 16.5 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రూ.830 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వీరికి గంజాయి సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన రవి, ముంబైకి చెందిన మాలిక్‌లపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన వ్యక్తులను రిమాండ్ కోసం రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరిచారు.



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు, రెవెన్యూ సిబ్బంది

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు, ఆసుపత్రికి తరలింపు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరుకు చెందిన ఒక బాలిక మూడు రోజుల క్రితం అదృశ్యం అయ్యింది. అయితే తన కుమార్తె ఆచూకీ కనుగొనడంలో పోలీసులు సక్రమంగా స్పందించడం లేదని బాలిక తండ్రి నక్క నారాయణరావు పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే పోలీసులు అతని ప్రయత్నాన్ని అడ్డుకుని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వివరాలలోకెళితే ఈ నెల ఒకటో తేదీన ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసేందుకు జె.కొత్తూరు నుంచి వచ్చిన బాలిక అదృశ్యమైంది. దీనిపై ఆమె తండ్రి జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఎవరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించడంలేదని నారాయణరావు సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని, అనుమానితులు ఎవరైనా ఉంటే తెలియజేయాలని అతనికి సూచించారు. ఈ తరుణంలో తన వెంట తెచ్చుకున్న పురుగు మందు సేవించి నారాయణరావు ఆత్మహత్యయత్నం చేశాడు. ఈ విషయమై ఎస్సైను వివరణ కోరగా బాలిక ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్టు ఎవరిపైనైనా అనుమానం ఉంటే చెప్పమని అడిగితే నారాయణరావు చెప్పడం లేదన్నారు.